క్లుప్తంగా

వాలాబులో పైపులైన్ పనులకు భూమి పూజ



పనులు ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ శివారు బొడ్డగుమ్మి నుంచి నగరంపాలేనికి జలజీవన్ మిషన్ పైపులైన్ పనులకు శుక్రవారం ఉప సర్పంచ్ సిహెచ్. ఈశ్వరమ్మ భూమిపూజ చేశారు. వార్డు మెంబర్ టి. శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోడెల నానిబాబులతో కలిసి ఆమె పైపులైన్ ఏర్పాటుకు జేసీబీతో పనులను ప్రారంభించారు. ఈ పనులు పూర్తి కాగానే ప్రతీ ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

3 ఆర్బీకేల్లో 30 టన్నుల యూరియా సిద్ధం



దేవరాపల్లి ఆర్బీకేలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: మండలంలోని వేచలం, కలిగొట్ల, వాకపల్లి ఆర్బీకేలకు 30 టన్నుల యూరియా అందుబాటులోకి వచ్చిందని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. దేవరాపల్లి రైతు భరోసా కేంద్రాల్లో యూరియా నిల్వలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 20 ఆర్బీకేల్లో ఇప్పటి వరకు 276 మెట్రిక్ టన్నుల యూరియా, 30 మెట్రిక్ టన్నుల డీఏపీని రప్పించి రైతులకు పంపిణీ చేశామన్నారు. ఏఈవో ఎస్. కిరణ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు కె. సత్యారావు, భాగ్య పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన తహసీల్దార్ కార్యాలయం

బుచ్చెయ్యపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి శనివారం ప్రారంభించనున్నారు. ఇక్కడ 30 ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల రూ.90 లక్షలతో కొత్త భవనం నిర్మించారు. ఈ భవనం పూర్తి కావడంతో వసతి సమస్య తీరనుంది.

ఆర్బీకేలకు మందుల సరఫరా



అవురువాడ ఆర్బీకేకు చేరుకున్న మందులు

మాడుగుల: రాజన్న పశువైద్యంలో భాగంగా పశువులకు మెరుగైన వైద్యం అందించడానికి రైతు భరోసా కేంద్రాలకు అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ నుంచి మందులు సరఫరా చేసినట్లు ప్రాంతీయ పశువైశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. మండలంలో 23 ఆర్బీకేలకు ఒక్కొక్క దానికి రూ.33 వేల విలువ కలిగిన మందులు సరఫరా చేశామన్నారు. పాడి రైతులు ఇక నుంచి ఆర్బీకేల ద్వారా తమ పశువులకు అవసరమైన మందులు ఉచితంగా పొందాలన్నారు.

పార్టీ విజయానికి కృషి చేస్తా



హోం మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిద్ధూ

రోలుగుంట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రతినిధి, కన్నడ హీరో గొందు సిద్ధూ అన్నారు. హోం మంత్రి తానేటి వనితను ఆయన శుక్రవారం కొవ్వూరులో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార కిట్లు పంపిణీ



దేవరాపల్లిలో గర్భిణులకు, బాలింతలకు పోషణ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి



రోలుగుంట: పోషకాహార కిట్లు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



మాకవరపాలెంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు



మాడుగుల రూరల్: పెంటయ్యపాలెంలో కిట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

దేవరాపల్లి: పౌష్టికాహారాన్ని తీసుకోవడంతోనే గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక ద్రోణంరాజు ఆడిటోరియంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో వి.మంగతయారు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, వైద్యాధికారి ఎస్. లలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాములమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రభుత్వం విద్య, వైద్యం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటూ తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ సర్వేశ్వరరావు, నాయకులు పెట్ల భద్రాచలం, గొంతిన హరిబాబు, చిటికెల రమణ, బొడ్డు గోవిందరావు, సూపర్‌వైజర్లు సరోజినీదేవి, రమణమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వూరులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని పోషకాలు కలిగిన ఈ కిట్లను క్రమ పద్ధతిలో వాడడం వల్ల ఆరోగ్యంతోపాటు రక్త వృద్ధి చెందుతుందన్నారు.

కె.కోటపాడు: గర్భిణులకు, బాలింతలకు మెరుగైన ఆరోగ్యం కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్నట్లు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ అన్నారు. చౌడువాడలో పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రామునాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.మంగవేణి, ఎ.హెచ్.కె.ఈశ్వరమ్మ, జగదీశ్వరి, సత్య, పద్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: పెంటయ్యపాలెం, పోతనపూడి, కొండయ్యపాలెం గ్రామాల్లో గర్భిణులకు పోషణ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వీరవిల్లి అగ్రహారంలో సర్పంచ్ వెలగాడ ఈశ్వరమ్మ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ కోరుకొండ భవానీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, వార్డు మెంబరు సాంబమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. ధనలక్ష్మి, కె.శ్యామల, బి.భారతి పాల్గొన్నారు.

నాతవరం: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. శుక్రవారం సరుగుడు అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లు గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. సర్పంచ్ గంగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు జయమ్మ, చంద్రలీల, ఆయాలు పాల్గొన్నారు.

రావికమతం: తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని మత్సవానిపాలెం సర్పంచ్ మలిచెట్ల గణేష్, దొండపూడి ఉప సర్పంచ్ రాజారావు అన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్రెడ్డి తాతబాబు పాల్గొన్నారు.

చోడవరం: గర్భిణులు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మైచర్లపాలెం సర్పంచ్ బూరే మాణిక్యం తెలిపారు. గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం కిట్లను మైచర్లపాలెంలో శుక్రవారం పంపిణీ చేశారు.



వీరవల్లి అగ్రహారంలో కిట్లు అందజేస్తున్న సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు



రావికమతం: పోషణ కిట్లు అందిస్తున్న దృశ్యం



చోడవరం: మైచర్లపాలెంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాణిక్యం



నాతవరం: సరుగుడులో సంపూర్ణ పోషణ్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



కె.కోటపాడు: చౌడువాడలో కిట్లు అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎంపీటీసీ రాజేష్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రోలుగుంట: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం నిబంధనల మేరకు పదో తరగతిలో చేరేందుకు 2021 ఆగస్టు 31వ తేదీకి 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఇంటర్లో చేరేందుకు పదో తరగతి పూర్తయి, 2022 ఆగస్టు 31వ తేదీకి 15 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఈ నెల 31వ తేదీలోగా పదో తరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మిరిన్ని వివరాలకు తమ పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

బొడ్డరేవులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్ తదితరులు

మాడుగుల: రామచంద్రాపురం నుంచి బొడ్డరేవు గిరి గ్రామం వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సాలం రమేష్ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దీని నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.1.10 కోట్లు మంజూరు చేశారు. ఈ రోడ్డు పూర్తయితే రెండు గిరి గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆగారి దేవి, పంచాయతీ కన్వీనర్ బూసారి ఈశ్వరరావు, గ్రామస్తులు ఉబ్బెటి రక్షకుడు, తుర్రే ఈశ్వరరావు, చొక్కాకుల సత్యం, రేగం లక్ష్మణరావు పాల్గొన్నారు.

15న చిత్రలేఖన పోటీలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఈ నెల 15న చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి సీహెచ్ రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజుపాలేనికి తారురోడ్డు పనులు ప్రారంభం

- 'గడప గడప'లో ఇచ్చిన మాట నెరవేర్చిన విప్ ధర్మశ్రీ
- 70 ఏళ్ల కల నెరవేరడంతో గ్రామస్తుల ఆనందం



రోడ్డు నిర్మాణానికి వేసిన గ్రావెల్ రోడ్డు వద్ద సంతోషంతో గ్రామస్తులు



రాజుపాలెంకు ఇప్పటి వరకు మట్టి రోడ్డే దిక్కు

బుచ్చెయ్యపేట: మండల శివారు గ్రామం రాజుపాలేనికి పక్కా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పది రోజుల క్రితం ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇక్కడ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన బాగుందని, తమ గ్రామానికి రోడ్డు లేదని, బురద మట్టి రోడ్డుతో నిత్యం అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు.70 ఏళ్లుగా రోడ్డు వేయాలని ఎంతమంది నాయకులను వేడుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీరైనా రోడ్డు సదుపాయం కల్పించాలని, మీకు రుణపడి ఉంటాం' అని సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ గోకివాడ రాము, నాయకులు నేమాల సత్యనారాయణ, కోట్ని దేముళ్లు, అప్పలరాజు, సాగిరాజు భగవాన్, పాము చిరంజీవి, నేమాల రాముకోటి తదితర్లు ప్రభుత్వ విప్ ధర్మశ్రీని వేడుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రోడ్డు సమస్యను తీసుకెళ్లి పది రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.1.34 కోట్లు మంజూరు చేయించారు. దీంతో రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు శుక్రవారం ప్రారంభించారు. దాంతో ఏడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రోడ్డుకు ఇప్పటికైనా మోక్షం కల్గిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ఏర్పాటు వల్ల రాజుపాలెం, పీపీ అగ్రహారం, పెదపూడి గ్రామస్తులకు పూర్తి స్థాయిలో రవాణా సదుపాయం కలుగుతుంది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి మూడు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నర్సీపట్నం: బలిఘట్టం అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో హెచ్‌బీ స్క్రీనింగ్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును ప్రిన్సిపాల్ ఎన్.వెంకటరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎంపీహెచ్ఎస్ మాలిరెడ్డి ధనవరలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనత వల్ల పిల్లల్లో ఎదుగుదల మందగిస్తుందన్నారు. దీన్ని అధిగమించేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది మస్తాన్ బేబీ, పాఠశాల స్టాఫ్ నర్సు ప్రసన్న విద్యార్థులకు ఎత్తు, బరువుతోపాటు హెచ్‌బి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు.

రూ. 50 లక్షలతో దేవరాపల్లిలో పార్కు నిర్మాణం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లిలో పార్కు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఆహ్లాదకర వాతావరణాన్ని పంచే విధంగా దేవరాపల్లిలోని సువిశాల స్థలంలో పార్కు నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు పార్కు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో ఇరిగేషన్‌కు సంబంధించిన స్థలంలో వుడా నిధులు ఫస్ట్ పేజ్‌లో రూ.50 లక్షలతో పార్కును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రహరీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించిన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. రెండో దఫాలో మరో రూ. 50 లక్షలతో నందనవనంగా పార్కును తీర్చిదిద్దుతామన్నారు. అంతకు ముందు నూతన ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి పంచాయతీరాజ్ ఏఈ ఉమామహేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

చివరి దశకు చేరిన వరినాట్లు

గొలుగొండ: మండలంలో వరినాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. దారగెడ్డ, బొడ్డేరు, విప్పలపాలెం ఆయకట్టు దిగువున నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు భూములు ఉన్నాయి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో దాదాపుగా నాట్లు వేశారు. ఇక్కడ నాట్లు వేయడానికి దారకొండ ప్రధాన ఆదారం. ఈ కొండపై పది రోజుల క్రితం భారీ వర్షాలు కురవడంతో సాగునీరు ప్రవహిస్తోంది. దాంతో ఈ ప్రాంతంలో నాట్లు పూర్తయితే తప్ప తాండవ జలాశయానికి సాగునీరు ప్రవహించడం వీలు కాదు. డివిజన్ పరిధిలో గొలుగొండ మండలంలో ముందుగానే నాట్లు పూర్తి కానున్నాయి.

విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్

నర్సీపట్నం స్థానిక వెంకునాయుడుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 80 మంది విద్యార్థులకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ తన సొంత నగదు రూ.20 వేలు వెచ్చించి వైట్ యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని రంగాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ముందుంజలో ఉండాలనే దృక్పథంతో యూనిఫాం ఉచితంగా అందించానన్నారు. త్వరలో వైట్ షూస్, ఐడీ కార్డులు అందిస్తానన్నారు. ఉపాధ్యాయులు ఆర్.సునీత, పి.శివ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

అనకాపల్లిటౌన్: రోజురోజుకూ పెరుగుతోన్న సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ చిగురుపాటి కిరణ్ సూచించారు. స్థానిక డైట్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల వర్క్‌షాపు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపు శనివారం కూడా కొనసాగనుంది. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, సీఎస్ఈ విభాగాధిపతి సుజాత, అకడమిక్ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష



తల్లి పాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గొలుగొండ: ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బాలింతలకు తల్లిపాలు గొప్పతనం గురించి వివరించాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. శుక్రవారం చీడిగుమ్మలలో తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిపాలతోనే పుట్టిన బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు: తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. రొంగలినాయుడుపాలెంలో తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులకు, బాలింతలకు శుక్రవారం ఆమె అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలను తప్పనిసరిగా అందివ్వాలని సూచించారు. తల్లి పాలలో అధిక ఔషధ గుణాలు ఉండటం వల్ల ఎటువంటి వ్యాధులు సోకవన్నారు. బిడ్డకు మొదటి వ్యాక్సిన్ తల్లిపాలేనని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పైల పైడితల్లమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పైల కోటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు చెల్లయ్యమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

215 పశువులకు లంపీస్కిన్ నిరోధక టీకాలు



కొరువాడలో పశువులకు లంపీస్కిన్ నిరోధక టీకాలను వేస్తున్న పశువైద్యాధికారి నాయుడు



పిల్లవానిపాలెంలో పశువుకు టీకా వేస్తున్న ఏడీ చిన్నంనాయుడు

కె.కోటపాడు: ప్రస్తుతం తెలుపు రంగు పశువులు లంపీస్కిన్ బారిన పడే పరిస్థితి ఉండటం వల్ల టీకాలను వేయించాలని పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. శుక్రవారం కొరువాడలో 215 పశువులకు లంపీస్కిన్ నిరోధక టీకాలు వేశారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులకు శరీరమంతా దద్దుర్లు, అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం వస్తుందని, తద్వారా పశువు నీరసించి పోతుందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొనే శక్తి పశువుకు కల్పించేందుకు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నామని వివరించారు. పశువులకు ఉచితంగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు వేచలపు గోవింద తదితరులు పాల్గొన్నారు.

లంపీస్కిన్ టీకా వేయించాలి
– పశుసంవర్ధక శాఖ ఏడీ చిన్నంనాయుడు

రావికమతం: పశువులకు ప్రాణాంతకమైన లంపీస్కిన్ దరి చేరకుండా టీకా వేయించాలని చోడవరం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిన్నంనాయుడు తెలిపారు. శుక్రవారం పిల్లవానిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ గుమ్మాల శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లంపీస్కిన్ వ్యాధి పశువులను వేధిస్తుండటంతో ప్రభుత్వం టీకా ఉచితంగా వేస్తున్నట్టు తెలిపారు. ఒక పశువు నుంచి మరొక పశువుకు జోరీగ ద్వారా వ్యాపిస్తుందన్నారు. మండలంలో ఈ నెలాఖరులోగా ఆరు వేల పశువులకు నివారణ టీకా వేయాలని లక్ష్యంగా చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తకోట, తట్టబంద పశువైద్యాధికారులు బాలతేజ, నూకేశ్వరరావు, సహాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న శుక్రవారం తెలిపారు. నాతవరం పీహెచ్‌సీ పరిధిలో 4,767 మందికి, గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో 2,596 మంది పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తామన్నారు. వీటిపై ముందుగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి వేయించాలన్నారు. పిల్లల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వేస్తున్నామని వివరించారు.

రోడ్డు విస్తరణకు నిరభ్యంతర పత్రాల స్వీకరణ



భవన యజమానితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణకు స్వచ్ఛందంగా ముందుకువచ్చి భవన యజమానుల నుంచి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నిరభ్యంతర పత్రాలను స్వీకరిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా శుక్రవారం ఆయన భవన యజమానులను స్వయంగా కలిశారు. కొంతమంది భవన యజమానులు అంగీకార పత్రాలను అందజేశారు. భవిష్యత్తు అవసరాలు, ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉన్నందున రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవన యజమానులు, వ్యాపారులు అభివృద్ధికి సహకరించాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు రోడ్డు విస్తరణను వంద నుంచి 90 అడుగులకు కుదించామన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ సచివాయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు, టి.పి.ఎస్ ప్రసాద్, సచివాలయ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వరి నాట్లలో యాజమాన్య పద్ధతులు మేలు



దామునాపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ హేమసుందర్

చోడవరం: దామునాపల్లిలో వరినాట్లు వేస్తున్న పొలాలను శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ హేమసుందర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతోపాటు వరిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసేటప్పుడు వరుస క్రమంలో వేస్తే అధిక దిగుబడి వస్తుందని ఆయన చెప్పారు. అంతేకాకుండా వరికి పురుగు, దోమ ఉధృతిని తగ్గించవచ్చని సూచించారు. రైతులు నారుమడులు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నాగమణి, మండల ఇన్‌చార్జి సన్నిబాబు పాల్గొన్నారు.